క్లుప్తంగా

ప్రజలకు రవీంద్రనాథ్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు



కడప కల్చరల్ : దీపావళి పండుగ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, పార్టీ అభిమానులతో పాటు ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా ఈ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన పరీక్ష ఫీజులకంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. జిల్లాలోని కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం నిర్దేశిత పరీక్ష ఫీజుల కన్నా అధికంగా వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి ప్రైవేట్ జూనియర్ కళాశాలపై బోర్డు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలలకు 31వ తేదీ దీపావళి సందర్భంగా సెలవు దినంగా ప్రకటించామని పేర్కొన్నారు.

వెంకటనారాయణకు డాక్టరేట్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధకులు తమ్మిశెట్టి వెంకట నారాయణకు వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేశారు. వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు ఎం.ఎం.వినోదిని పర్యవేక్షణలో 'తెలుగులో శ్రామిక కథలు స్త్రీ చైతన్యం (1980 నుంచి 2015 వరకు)' అనే అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ఆచార్య కెఎస్వీ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పేలుడు ఘటనాస్థలిని పరిశీలించిన కమిషనర్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మార్కెట్ యార్డ్ సమీపంలోని అన్న క్యాంటీన్ ఆహార తయారీ శాలలో గ్యాస్ లీక్‌తో భారీ పేలుడు సంభవించిన ప్రాంతాన్ని మున్సిపల్ మనోజ్ రెడ్డి పరిశీలించారు. సాంకేతిక లోపం వలన ఈ ఘటన చోటు చేసుకున్నట్లు అక్కడి సిబ్బంది కమిషనర్‌కు వివరించారు. రాత్రి సమయంలో పేలుడు సంభవించడం వలన ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరుగులేదని తెలిపారు. ప్రమాదాలు జరుగుకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ విజయభాస్కర్ గౌడ్, టీపీబీఓ రాధాకృష్ణ, అన్న క్యాంటీన్ ఎగ్జిక్యూటివ్ సూపర్‌వైజర్ చిన్న ఓబయ్య, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా శిక్షణా శిబిరం

కడప కల్చరల్ : కడప నగరం పటేల్‌రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల యోగా శిక్షణా శిబిరాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నామని సంస్థ నిర్వాహకులు, యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు డాక్టర్ కె.కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.

చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఓ దీపావళి



రంగురంగుల దీపాలతో విద్యార్థులు



గోదుమపిండితో తయారు చేసిన రకరకాల హరిత దీపాలు



ముగ్గు చుట్టూ రంగురంగుల దీపాలతో అలంకరణ

కడప ఎడ్యుకేషన్ : చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఓ దీపావళి అంటూ ముందస్తు దీపావళి వేడుకలో విద్యార్థులు సందడి చేశారు. బుధవారం కడప చెమ్మియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మేరీ ఆధ్వర్యంలో విద్యార్థులు ముందస్తు దీపావళిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఎంఈఓ దిద్దకుంట గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో దీపావళి వెలుగులు నిండాలని, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. విద్యార్థులు గోదుమపిండితో చేసిన రంగురంగుల దీపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే పాఠశాల ఆవరణలో రకరకాల ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మేరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దీపావళి వెలుగులు నింపాలి

అక్కాయపల్లెలోని సాయిబాబా విద్యాసంస్థల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ దీపావళి పండుగ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

గురుకుల విద్యాపీఠంలో..

కడప నగరంలోని గురుకుల విద్యాపీఠం స్కూల్లో ముందస్తు దీపావళి ఉత్సావాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్ వీరకుమారి, సీఈఓ వివేకానంద, పాఠశాల హెచ్‌ఎం మునిచంద్ర, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు విద్యార్థులకు దీపావళిశుభాకాంక్షలు తెలియచేశారు.



విద్యార్థులతో కలిసి దీపావళి జరుపుకుంటున్న హెచ్‌ఎం మునిచంద్ర, ఉపాధ్యాయులు

ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

కడప నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు దీపావళి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దీపావళిని విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.



గోదుమ పిండితో పలు రకాల డిజైన్‌లతో తయారు చేసిన దీపాలు

ఇది కరువు కాదా?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లాకు చోటు దక్కకపోవడం రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురి చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించిన 54 కరువు మండలాల జాబితాలో కడప జిల్లాలో ఒక్క మండలం కూడా లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో రాయలసీమ పరిధిలోని 5 జిల్లాల్లో 54 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారని పేర్కొన్నారు. నైరుతి ఋతుపవనాలు సీజన్‌లో (జూన్ -సెప్టెంబర్) రాష్ట్ర సాధారణ వర్షపాతం 574.7 మి.మీ ఉండగా 681.6మిమీ వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కేంద్ర వ్యవసాయ శాఖ కరువు మాన్యువల్ ప్రకారం రెండు మ్యాన్డేటరీ సూచికలు మరియు నాలుగు ఇంపాక్ట్ సూచికలు , క్షేత్రస్థాయిలో వాస్తవాలతో కూడిన జిల్లా కలెక్టర్ నివేదిక నియమాల ప్రకారం ఖరీఫ్-2024లో 27 మండలాల్లో తీవ్ర కరువు, 27 మండలాల్లో మధ్యస్థ కరువు ప్రకటించినట్లు తెలిపారని చెప్పారు. కడప జిల్లాలోని 36 మండలాల్లో 2024 ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 77,169 ఎకరాలకు గాను 66,998 ఎకరాలు సాగు అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని పెద్దముడియం, కలసపాడు, తొండూరు మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదు అయిందని తెలిపారు. అయినా ఈ మండలాలను కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విధాలా నష్టపోయిన రైతులకు పంటల బీమా, పెట్టుబడి రాయితీ పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ మీనాక్షి

కడప ఎడ్యుకేషన్ : రానున్న పదవ తరగతి పరీక్షలో అన్ని యాజమాన్య పాఠశాలలు ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని డీఈఓ మీనాక్షి సూచించారు. ఆంధ్రప్రదేశ్ జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం (ఏపీబీఎస్‌టీఎఫ్) రాష్ట్ర అకాడమిక్ సెల్ ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి విద్యార్థుల స్టడీ మెటీరియల్ బుధవారం డీఈఓ మీనాక్షి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీఈఆర్టీ మోడల్ పేపర్ తో పాటు 5 మోడల్ పరీక్ష పేపర్లు చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి మంచి మార్కులతోపాటు మంచి స్కోర్ సాధించేందుకు ఈ మెటీరియల్ విద్యార్థులకు బాగా ఉపయోగం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బయలాజికల్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు బీఏ విజయప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామ్మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసులరెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి విజయేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి అయ్యప్పస్వామి పూజల అంకురార్పణ

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అయ్యప్పస్వామి ప్రత్యేక పూజల అంకురార్పణ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు దేసు వెంకటరెడ్డి తెలిపారు. ఆలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. నవంబరు 2 నుంచి కార్తీక మాసం ప్రారంభమవుతుందని, ఆరోజున ఆలయంలో శ్రీ అయ్యప్పస్వామి పూజలతోపాటు మండల దీక్షలు, పూజలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 4-00 గంటలకు మేలుకొలుపు, గోపూజ, 4.30 గంటలకు శ్రీ గణపతి పూజ, అభిషేకము ఉంటాయన్నారు. 5.00 గంటలకు గురుస్వామి చే అయ్యప్ప దీక్ష తీసుకునే వారికి గురుస్వామి మాల ధారణ చేస్తారని తెలిపారు. 6.30 గంటలకు పరమేశ్వరునికి లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం, తర్వాత తీర్థ ప్రసాద వినియోగం ఉంటాయన్నారు. సాయంత్రం 5.00 గంటలకు ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ధ్వజం ఆరోపణ కార్యక్రమం నిర్వహిస్తామని, 5.30 గంటలకు శ్రీఅయ్యప్పస్వామికి కలశారాధన, పుణ్యాహవాచనం, సంప్రోక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాత్రి 7.00 గంటలకు అయ్యప్ప స్వామి పడిపూజ, భజనలు, 9.00 గంటలకు కార్యక్రమాల ముగింపు, అనంతరం బిక్ష ఉంటుందని తెలిపారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో స్వచ్ఛభారత్



స్వచ్ఛతా కార్యక్రమాల్లో పాల్గొన్న వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్, రిజిస్ట్రార్ తదితరులు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతా హీ సేవ-2024లో భాగంగా విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న స్ఫూర్తితో నిర్వహించే స్వచ్ఛతా కార్యక్రమాల చక్కటి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. స్వచ్ఛభారత్ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవడం ద్వారా రోగాల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. వరలక్ష్మి, రమాదేవి, ఉదయప్రకాష్‌రెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు.

నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

కడప కార్పొరేషన్ : కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి బుధవారం తన పర్యటనలో భాగంగా మున్సిపల్ స్టేడియం, పరిసర ప్రాంతాలను ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీపావళి టపాసుల స్టాల్స్‌లో అన్ని జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని, దుకాణదారులకు సూచించారు. ప్రజలందరూ దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని కోరారు. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రతాప్ రెడ్డి, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణానికి సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్ : సురక్షిత ప్రయాణానికి వాహనదారులు సీట్‌బెల్ట్, హెల్మెట్‌లను తప్పని సరిగా వినియోగించాలని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ సూచించారు. బుధవారం కడప నగర శివార్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో భారత ప్రభుత్వ యువజ వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు మై భారత్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో దివాలి విత్ మై భారత్ అనే కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ సేవలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటి నాగమ్మ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ విజయ్, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

జనరిక్ పేరుతో మందుల చీటీ ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఆస్పత్రులకు వచ్చే రోగులకు డాక్టర్లు బ్రాండ్ పేరుతో కాకుండా జనరిక్ పేరుతో మందుల చీటి ఇవ్వాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి సి.శేఖర్, సభ్యుడు సి.గురురాం ప్రసాద్ బుధవారం డీఆర్వోకు వినతిపత్రాన్ని ఇచ్చారు. క్లాజ్-1.5 ఆఫ్ ఇండియన్ మెడికల్ కౌన్సిల్-2002 చట్టం ప్రకారం ఈ చర్యలు తీసుకోవాలని కోరారు. భారతీయ జన ఔషధ ప్రయోజన ద్వారా దేశంలో 12,500 జనరిక్ మందుల షాపులను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే ప్రజలు జనరిక్ మందులను పూర్తియయిలో వినియోగించుకోలేక పోతున్నారని, అందుకు డాక్టర్లు బ్రాండ్ పేరుతో మందులను సూచించడమే కారణమన్నారు. ఈ అంశంపై సినిమా థియేటర్లు, టీవీలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు తదితర ప్రదేశాల్లో ప్రచారం నిర్వహించాలని కోరారు.

ఫాతిమా మెడికల్ కళాశాలలో ఎక్సేషియా ఫెస్ట్



ఫాతిమా వైద్య కళాశాలలో జరిగిన ఎక్సేషియా ఫెస్ట్‌లో పాల్గొన్న అతిథులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో మంగళవారం రాత్రి 'ఎక్సేషియా ఫెస్ట్' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప ఎమ్మెల్యే ఆర్. మాధవీరెడ్డి, టీడీపీ పార్లమెంట్ పోలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ ఏక్యూ జవాద్ మాట్లాడుతూ ప్రతి వైద్య విద్యార్థి కళాశాల విద్యతో పాటు సామాజిక కార్యకలాపాలలో పాల్గొనాలని, మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ముర్తుజా, ప్రిన్సిపాల్ డాక్టర్ శైలరేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ జయరామిరెడ్డి, డాక్టర్ ఎంసీ ఓబులేసు, కళాశాల సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేయలేదు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప రాజంపేట బైపాస్ రోడ్‌లో వాహనాలను తనిఖీ చేయలేదని కడప బ్రేక్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్ పేర్కొన్నారు. బుధవారం నగర శివార్లలోని ఊటుకూరు రవాణాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను వ్యక్తిగత నిమిత్తం తిరుపతికి సొంత వాహనంలో వెళుతుండగా రాజస్థాన్ చెందిన వాహనాలు తమ వాహనాన్ని ఢీ కొనేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నానని తెలిపారు.

రవాణా శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న రవాణా శాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని పార్టీ ఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిరామయ్య, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరి కేసీబాదుల్లా, సీఐటీయూ నాయకులు మనోహర్, శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీదేవి పేర్కొన్నారు బుధవారం వారు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప రవాణా శాఖ కార్యాలయంలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ పనిచేస్తున్న విజయభాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

దేశ ఐక్యతకు పటేల్ విశేష కృషి



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : దేశ ఐక్యతకు విశేష కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని వివేకానంద కళాశాల కరెస్పాండెంట్ డీఎస్ఆర్ మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్రం, జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో ఐక్యత దినోత్సవం పురస్కరించుకొని మాదకద్రవ్యాలపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బుధవారం విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, ఎన్ఎస్ఎస్ పీఓ మస్తాన్‌బీ, సంస్థ సభ్యులు విజయ్, శ్రీకాంత్, సుష్మిత, హర్షిత పాల్గొన్నారు.

ఘనంగా ఏక్తా దివస్

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని బుధవారం ముందస్తుగా రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ డా. విజయలక్ష్మి, ఎన్‌సీసీ అధికారి డా. స్వరూప, కృష్ణవేణి పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప ఉక్కు పరిశ్రమ, విభజన హామీలు అమలు చేయాలని డీవైఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు జాక్సీ థామస్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ కోసం జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడతామని తెలిపారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీ కోసం యువత ఆశగా ఎదురు చూస్తున్నారని, ఎన్నికలలో ఖాళీ పోస్టుల భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజులు దాటిందని నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్, జగదీష్ పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం నవంబర్ 1న విశాఖపట్నంలో జరిగే విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాహుల్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు.